Andhra Jyothy    Dt-07/07/18.



# 'డబుల్' థ్రిల్..!

- ఒకేచోట రెండు లైన్లు.. నాలుగు ట్రైన్లు
- టూరిస్ట్ స్పాట్‌గా రంగ్‌మహల్ చౌరస్తా



రంగమహల్ చౌరస్తాలో ఒక మెట్రో కారిడార్‌పై మరో మెట్రో కారిడార్ నిర్మాణం

**హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఒక ఆధునిక ఇంజనీరింగ్ మాత్రమే కాదు... అద్భుతమైన పర్యాటక ప్రదేశంగానూ మారనుంది. మహానగర చారిత్రక నేపథ్యం, అత్యాధునిక హంగులతో ఆకట్టుకోనుంది. మెట్రో ప్రయాణం అందమైన అనుభూతిని మిగిల్చేలా తీర్చిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే కోఠి-ఎంజీబీఎస్ మధ్య రంగ్‌మహల్ వద్ద రెండు మెట్రో కారిడార్లు ఒకదానిపై మరొకటి వెళ్తున్నాయి. నిర్మాణ దశలో ఉన్న ఈ ప్రాంతంలో భవిష్యత్‌లో మెట్రో రైళ్ల రాకపోకలతో ఆకర్షణీయంగా మారనుంది. ఈ ఏరియాను మెట్రో కారిడార్‌లోనే ముఖ్యమైన పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడానికి హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇటీవలే మెట్రో ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి, అదనపు హంగులను జోడిస్తూ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్చర్ నిపుణులకు పలు సూచనలు ఇచ్చారు.

### రెండంతస్తుల్లో ఒకేసారి 4 రైళ్లు..

రంగ్‌మహల్ చౌరస్తాలో సుమారు 300 మీటర్ల మేర మెట్రో కారిడార్-1(మియాపూర్-ఎల్‌బీనగర్)పై మెట్రో కారిడార్-2(జేబీఎస్-ఫలక్‌నుమా) మార్గం నిర్మాణం జరుగుతోంది. త్వరలోనే కారిడార్-1లో రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఈఏడాది చివరి నాటికి కారిడార్-2కూ ప్రారంభమవుతుంది. ఇలా ఒకేచోట నుంచి రెండతస్తుల్లో ఒకేసారి 4 మెట్రో రైళ్లు పరుగులు తీసే దృశ్యం గొప్ప అనుభూతిని మిగులుస్తుందనడంలో సందేహం లేదు. మెట్రోలో ప్రయాణించేవారే గాక ఇతరులూ చూసేందుకు వీలుగా ఇక్కడ నిర్మాణాలు చేపట్టనున్నారు. నాంపల్లి నుంచి చాదర్‌ఘాట్ వరకు 5 కి.మీ మేర నిర్మిస్తున్న మెట్రో వారసత్వ ఆవరణలో భాగంగానే రంగ్‌మహల్ చౌరస్తాను పర్యాటక ప్రదేశంగా మెట్రో అధికారులు తీర్చిదిద్దనున్నారు.

# రాత్రి వేళల్లోనే మెట్రో ట్రయల్ రన్స్

- పగటిపూట సిగ్నలింగ్ సమస్య
- అమీర్‌పేట-ఎల్‌బీనగర్ మార్గంలో చురుగ్గా పనులు
- త్వరలో సీఎంఆర్ఎస్ అధికారుల బృందం తనిఖీలు

**మెట్రో లైట్స్**

**హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి):** అమీర్‌పేట-ఎల్‌బీనగర్ మార్గంలో మెట్రో పరుగులకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. నెలాఖరుకల్లా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అత్యంత కీలకమైన ట్రయల్ రన్స్ నిర్వహిస్తున్నారు. కారిడార్-1(మియాపూర్-ఎల్‌బీనగర్) మార్గంలో ఇప్పటికే మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు ప్రయాణికులతో రైళ్లు తిరుగుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రయాణికులతో నడుస్తున్న రైళ్లకు ఆటంకం లేకుండా, అమీర్‌పేట-ఎల్‌బీనగర్ మధ్య రాత్రి వేళల్లో ట్రయల్ రన్స్ నిర్వహిస్తున్నారు. మియాపూర్-అమీర్‌పేట మార్గంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక రైలు వచ్చేలా షెడ్యూల్ అమల్లో ఉండడంతో సిగ్నలింగ్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు రాత్రి సమయాలను ఎంచుకున్నట్లు ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ట్రయల్ రన్స్ తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు ఇంజనీర్లు పేర్కొన్నారు.

### ట్రయల్ రన్స్‌తో వివిధ పరీక్షలు...

ట్రయల్ రన్స్‌లో భాగంగా మొత్తం 18 రకాల సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. కేంద్ర రైల్వే శాఖ నుంచి కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఎంఆర్ఎస్) నుంచి ప్రత్యేక అధికారుల బృందం 20రోజుల్లో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టనుంది. వారి పరిశీలనలో సంతృప్తికరంగా అనిపిస్తేనే రాకపోకలకు అనుమతి ఇస్తారు. ఆ పరీక్షలు ఈనెలాఖరు వరకు విజయవంతంగా పూర్తిచేస్తామని మెట్రో అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా ఈ మార్గాన్ని ఘనంగా ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. మెట్రో రైలు ప్రాజెక్టులోనే అతి పొడవైన మార్గం, అత్యంత రద్దీ ఉండే అవడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

### శరవేగంగా పెండింగ్ పనులు...

మరో 25రోజుల గడువే ఉండడంతో ఓవైపు ఎల్ అండ్ టీ మెట్రో, మరోవైపు హెచ్ఎంఆర్ అధికారులు పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఫుట్‌పాత్‌ల ఆధునీకరణతోపాటు వరద నీరు నిలవకుండా మెట్రో అధికారులు కాల్వలు నిర్మిస్తున్నారు. పదిరోజులుగా నిర్వహిస్తున్న ట్రయల్ రన్స్‌లో ఎలాంటి ఇబ్బందులూ రాలేదని, సాఫీగా సాగుతున్నాయని అధికారులు తెలిపారు.



ట్రయల్ రన్‌లో భాగంగా అమీర్‌పేట-ఎల్‌బీనగర్ మార్గంలో పరుగులు తీస్తున్న మెట్రో రైలు